క్లుప్తంగా

నేడు భూ భారతిపై అవగాహన సదస్సు

నవాబుపేట: మండల కేంద్రంలోని లక్ష్మారెడ్డి గార్డెన్స్‌లో సోమవారం భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ బి.జైరాం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చట్టంపై రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేస్తామని చెప్పారు. ఈ అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య హాజరవుతారని వివరించారు. మండలంలోని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రోహింగ్యాలపై చర్యలు తీసుకోండి

పట్టణ ఠాణాలో ఫిర్యాదు చేసిన బీజేపీ నాయకులు



ఫిర్యాదుపత్రం చూపుతున్న బీజేపీ నాయకులు

తాండూరు టౌన్: పట్టణంలోకి అక్రమంగా వలస వచ్చిన రోహింగ్యాలు, పాకిస్తాన్, బంగ్లాదేశీయులను గుర్తించి వారి దేశాలకు పంపించాలని తాండూరు బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఈ మేరకు బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం ఆధ్వర్యంలో నాయకులతో కలిసి పట్టణ సీఐ సంతోష్‌కు ఫిర్యాదు చేశారు. తాండూరులో ఉన్న అక్రమ వలస దారులను వారి దేశాలకు వెనక్కి పంపించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

చలివేంద్రం ప్రారంభం



ఇప్పాయిపల్లిలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రహ్లాదరావు

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద రావు అన్నారు. ఆదివారం మండలంలోని ఇప్పాయిపల్లిలో గ్రామానికి చెందిన రాములు సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ఇతరులకు సహాయం అందించేందుకు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య ముదిరాజ్, నాయకులు అంజిలయ్య, భీమయ్య, మహేశ్, మహేశ్‌నాయక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



బాధితుడికి చెక్కును అందజేస్తున్న నాయకులు

పూడూరు: నిరుపేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని పీఏసీఎస్ చైర్మన్ పట్లోళ్ల సతీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కడుమూరు, మన్నేగూడ, తిర్మలాపూర్, చన్గోముల్ గ్రామాలకు చెందిన పలువురు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు కడుమూర్ ఆనందం, రఘునాథ్‌రెడ్డి, నాయకులు పెంటయ్య, శ్రీనివాస్, సురేందర్, కృష్ణ, రవి, అనంతరెడ్డి, బందయ్య, ఆరీఫ్, శివ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన 'సేంద్రియ' వాడకం



హరిదాస్‌పల్లిలో సేంద్రియ ఎరువును ట్రాక్టర్‌లో నింపుతున్న కూలీలు

ధారూరు: వ్యవసాయంలో ఉపయోగించే సేంద్రియ ఎరువు ధరలు ఈసారి అమాంతం పెరిగాయి. ఖరీఫ్ పంటల సాగు కోసం ఆదివారం రైతులు తమ పొలాలకు సేంద్రియ ఎరువును కొనుగోలు చేసి తరలించారు. రబీ పంటల కోతలు పూర్తయిన రైతులు స్థానికంగా లభించే ఎరువుపై ఆధారపడుతారు. ఒక ట్రాక్టర్ పశువుల సేంద్రియ ఎరువుకు రూ.4,500లకు కొనుగోలు చేసి తమ పొలాలకు తీసుకెళ్తున్నారు. గతేడాది ఒక ట్రాక్టర్ ఎరువుకు అన్ని కలిపి రూ.3,500 ఉండగా, ఈసారి ఏకంగా రూ.1,000 పెంచేశారు. ఇక మేకలు, గొర్రెల ఎరువు సైతం ఇదే ధరలతో కొనుగోలు చేయాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. రసాయనిక ఎరువులతో పొలాల్లో సారం తగ్గిపోతుందనే భయంతోనే సేంద్రియ ఎరువుపై మక్కువ చూపుతున్నారు.



వికారాబాద్‌లో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్



తాండూరు: జయశంకర్ విగ్రహం ఎదుట బీఆర్ఎస్ శ్రేణులు



మోమిన్‌పేట: టేకులపల్లిలో జెండా ఎగురవేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

రజతోత్సవ సంబురం

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి వద్ద ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల నుంచి గులాబీ దళాలు దండుకట్టి కదిలాయి. గ్రామాల్లో పార్టీ జెండాలు ఎగురవేసి బస్సులు, కార్లలో బయలుదేరారు. అంచనాలకు మించి జనం ప్రభంజనంగా తరలివెళ్లారు. పలువురు బైక్ ర్యాలీగా బయలుదేరారు.

– సాక్షి, నెట్‌వర్క్



పూడూరు: సభకు బయలుదేరే ముందు..



బంట్వారం: కరీంపూర్ నుంచి బయలు దేరుతున్న నాయకులు



దుద్యాల్: హస్నాబాద్‌లో జెండా ఎగురవేస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు



ధారూరు: నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



పరిగి: జెండా ఆవిష్కరణలో మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్‌కుమార్



దోమ: రజతోత్సవ సభకు బయలుదేరుతున్న నేతలు



బొంరాస్‌పేట: పార్టీ జెండావిష్కరణ చేస్తున్న నాయకులు



కుల్కచర్ల: చౌడాపూర్‌లో జెండా ఆవిష్కరణలో బీఆర్ఎస్ శ్రేణులు

ఉగ్రమూకలను అంతం చేయాలి



మర్పల్లి: ఉగ్రదాడికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ చేపట్టిన హిందూవాహిని సభ్యులు



అనంతగిరి: కొవ్వొత్తులతో ర్యాలీ



పరిగి: సంతాప కార్యక్రమంలో కృష్ణస్వామి తదితరులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో ఆదివారం కశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాద దుర్ఘటనను ఖండిస్తూ అర్చక పురోహిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం చనిపోయినవారికి సంతాప సూచకంగా కొవ్వొత్తులు ప్రదర్శించి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులపై దాడి దారుణం

కొడంగల్: ఉగ్రవాదులను అంతం చేయాలని పర్సాపూర్ గ్రామస్తులు ముక్తకంఠంతో నినదించారు. కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడికి నిరసనగా శనివారం రాత్రి గ్రామంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలన్నారు. హిందూవాహిని సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పర్యాటకులపై దాడి చేసి చంపడం దారుణమన్నారు. భారత ప్రభుత్వం పాకిస్తాన్‌పై దాడిచేసి ఉగ్రవాదులను మట్టి కరిపించాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలి

పరిగి: జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి ఘటనపై కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని కృష్ణానందగురు స్వామి అన్నారు. ఉగ్రదాడిని ఖండిస్తూ ఆదివారం మండల పరిధిలోని బసిరెడ్డిపల్లిలోని కృష్ణగిరి క్షేత్రంలో మృతులకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉగ్రదాడి యాత్రికులపై జరిగిన దాడి కాదని యావత్ భారతదేశంపై జరిగిన ఉగ్రదాడి అని అన్నారు. ఈ దాడికి ప్రతీకారం తీర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

యువత చదువు, క్రీడలపై దృష్టి సారించాలి



విజేతలకు బహుమతి అందజేస్తున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, రవీందర్ తదితరులు

- వ్యసనాలకు దూరంగా ఉండాలి
- ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు

యాచారం: యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువు, క్రీడలపై దృష్టి సారించాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. మండల పరిధిలోని మొండిగౌరెల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారం ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ రాజు విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత లక్ష్యాన్ని నిర్దేశించుకు వాటి సాధనకు కృషి చేయాలన్నారు. రూ.లక్షన్నర వరకు ఖర్చుతో పోటీలు నిర్వహించడంపై రవీందర్‌ను ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

యువతకు అండగా ఉంటా: రవీందర్

క్రీడాకారులకు ఎల్లప్పుడు అండగా ఉంటానని బీజే పీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ అన్నారు. మాజీ సర్పంచ్ తాండ్ర లక్ష్మయ్య పేరు మీద ట్రస్ట్ ఏర్పాటు చేసి విరివిగా సేవా కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. కొలన్ మల్లారెడ్డి, ఆదిబట్ల పీఎస్ ఎస్ఐ కట్టెల సోమయ్య, ఆర్గనైజర్స్ మధు, ప్రవీణ్, ప్రసాద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాండూరు: పట్టణ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని డీఈఈ భాను ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తాండూరు పట్టణానికి విద్యుత్ సరఫరా చేసే 33 కేవీ సబ్ స్టేషన్‌లో ఫీడర్ మరమ్మతులు చేయాల్సి ఉందన్నారు. అందుకు మధ్యాహ్నం 1 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

'వరంగల్ సభకు ఆదరణ కరువు'

తాండూరు: బీఆర్ఎస్ పార్టీ సభకు నియోజకవర్గంలో ఆదరణ కరువైందని తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల ఓ ప్రకటనలో విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ పార్టీ సభలు పెడితే పోలీసు శాఖతో ఆంక్షలు విధించేదన్నారు. మరోవైపు సభకు ఆర్టీసీ బస్సులను సైతం ఇచ్చే వారు కాదన్నారు. కానీ బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తమ ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు విధించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ పెద్దేముల్ అధ్యక్షుడు గోపాల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డిలు.. మండలంలో బీఆర్ఎస్ పార్టీకి నాయకులు లేకపోవడంతో రజతోత్సవ సభకు జనాలను సమీకరించిలేక పోయారన్నారు.

రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయం

ఇబ్రహీంపట్నం: రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా ప్రజలంతా ఏకమై తమ హక్కులను కాపాడుకోవాలని కాంగ్రెస్ నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ ఉపాధ్యక్షుడు మంఖాల దాసు ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ర్యాలీని ఇబ్రహీంపట్నం, తుర్కగూడ, చర్లపటేల్‌గూడ గ్రామాల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగంలో అణగారిన బడుగు, బలహీన, దళిత, గిరిజనులకు రిజర్వేషన్లను, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సమాన హక్కులు, వాటాలను పొందుపరిచారన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ఇందిరాగాంధీ తీసుకువచ్చిందని గుర్తు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ, దెబ్బతీస్తోందని మండిపడ్డారు. రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న బీజేపీకి తగిన రీతిలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు ఈసీ శేఖర్‌గౌడ్, వెంకటేశ్వర్లు రాజశేఖర్ పాల్గొన్నారు.

బీజేపీ కుట్రలను తిప్పికొడుదాం

ఇబ్రహీంపట్నం రూరల్: రాజ్యాంగాన్ని మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుటిల యత్నాలను రాష్ట్రం ప్రజలు తిప్పికొట్టాలని కాంగ్రెస్ నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్ ఆధ్వర్యంలో తులేకలాన్, కప్పపహాడ్‌లో జైబాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు.

పర్యవేక్షణ లేక.. రాకపోకలకు ఇబ్బంది



రోడ్డు కంటే ఎత్తులో మ్యాన్‌హోల్

దుద్యాల్: సీసీ రోడ్డు ఏర్పాటు మండల కేంద్రంలో కొత్త చిక్కులను తెచ్చి పెట్టింది. ఇటీవల తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లడానికి రూ.10 లక్షలతో సీసీ రోడ్డును నిర్మించారు. ఆ సమయంలో డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను రోడ్డుకంటే ఎత్తులో అమర్చారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. రహదారి నిర్మించేటప్పుడు పర్యవేక్షించాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మ్యాన్‌హోల్స్ ఎత్తును రోడ్డుకి సమాంతరంగా ఉండేలా మరమ్మతులు చేయాలని మండలవాసులు కోరుతున్నారు.

కేంద్రానికి అండగా నిలుద్దాం



కుల్కచర్ల: మన్ కీ బాత్ వీక్షిస్తున్న కార్యకర్తలు



అనంతగిరి: కార్యక్రమాన్ని వీక్షిస్తున్న నాయకులు

కుల్కచర్ల: ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని దిశ కమిటీ సభ్యుడు జానకీరాం, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు అంజిలయ్య పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని చాపలగూడెం గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచం మెచ్చిన పాలనను అందిస్తున్న మోదీ నాయకత్వంలో దేశం మరింత ఉన్నతస్థితికి చేరుతుందన్నారు. విపత్కర పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్యముదిరాజ్, నాయకులు చంద్రలింగం, మైపాల్, కర్ణయ్య, సాయన్న, ఆంజనేయులు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మన్‌కీబాత్ వీక్షించిన నేతలు

అనంతగిరి: ప్రధానమంత్రి మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం వికారాబాద్ మండలంలోని కామరెడ్డిగూడలో బీజేపీ మండల అధ్యక్షుడు శివరాజుగౌడ్ ఆధ్వర్యంలో నాయకులు వీక్షించారు. కార్యక్రమంలో నాయకులు సదానందారెడ్డి, అమరేందర్ రెడ్డి, శ్రీదేవి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మి, మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

దుద్యాల్: మండల పరిధిలోని ఆలేడ్ గ్రామంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. స్థానిక చెరువుకు వెళ్లే మార్గంలో కంప చెట్లతో నిండిపోయింది. మరోవైపు సీసీ రోడ్డుపై మురుగు నీరు ఏరులై పారుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. నిత్యం దుర్వాసనతో తీవ్ర అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు వృద్ధి చెంది అంటు వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డుపై పారుతున్న మురుగు నీరు